క్లుప్తంగా

బాలయ్యకు పరామర్శ



నెల్లూరు(బారకాసు): వెంకటగిరి మున్సిపల్ వైస్ చైర్మన్ సేతురాశి బాలయ్యను నగరంలోని కిమ్స్ ఆస్పత్రిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. యోగక్షేమాలను ఆరాతీసి, త్వరలో కోలుకోవాలని కాంక్షించారు.

వైఎస్సార్‌సీపీ నేతకు పరామర్శ



నెల్లూరు(బారకాసు): హరనాథపురానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత షబ్బీర్ హార్ట్ స్ట్రోక్‌కు గురై చికిత్స పొందారు. ఈ క్రమంలో ఆయన ఇంటికెళ్లి పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఆరోగ్యంపై అడిగి తెలుసుకున్నారు.

చండీహోమం రేపు

నెల్లూరు(బృందావనం): ఫాల్గుణ మాస పౌర్ణమిని పురస్కరించుకొని మూలాపేటలోని శంకరమఠం ప్రాంగణంలో గల కామాక్షి సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో చండీహోమాన్ని గురువారం నిర్వహించనున్నామని నిర్వాహకులు కొర్రపాటి నందకిశోర్, ఉషాకుమారి దంపతులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హోమంలో పాల్గొనాలనుకునే భక్తులు 96528 60264, 99499 18358 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

వృద్ధుడి అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): వృద్ధుడు అదృశ్యమైన ఘటనపై కేసును చిన్నబజార్ పోలీసులు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. తిప్పరాజువారి వీధిలో నివాసం ఉంటున్న అశోక్ తండ్రి జయంత్‌లాల్ తరచూ ఇంటి నుంచి ఎటో వెళ్లిపోయి కొద్ది రోజుల తర్వాత తిరిగొచ్చేవారు. తాజాగా ఈ నెల ఎనిమిదిన ఇంటి నుంచి వెళ్లిన ఆయన జాడ తెలియరాలేదు. దీనిపై సోమవారం రాత్రి ఫిర్యాదు చేశారు. వృద్ధుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

పింఛన్లను మంజూరు చేయాలి

కోవూరు: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్లను మంజూరు చేయాలని సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా పోతిరెడ్డిపాళెం సచివాలయం వద్ద ఆందోళనను మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కమిటీ సభ్యుడు పెద్దబ్బాయి మాట్లాడారు. 50 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ పింఛన్లను అందజేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన టీడీపీ.. అధికారంలోకి వచ్చాక ఆ అంశాన్నే విస్మరించిందని ఆరోపించారు. పక్కనే పెన్నా ప్రవహిస్తున్నా, పోతిరెడ్డిపాళెం తిప్ప వద్ద గిరిజన కాలనీలో తాగునీటి సమస్యలున్నాయని చెప్పారు. సమస్యలను ఇప్పటికైనా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గండవరపు శేషయ్య, అఫ్రోజ్ అహ్మద్, నూకలపాటి మోహన, మణివర్మ, సురేష్, యస్దానీబాషా, ఊటుకూరు రమణయ్య పాకం శ్రీనివాసులు, రత్నమ్మ, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొడవలూరు: ప్రజా సమస్యలను కూటమి ప్రభుత్వం గాలికొదిలేసి విమర్శలకే పరిమితమైందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గోనె దయాకర్ ఆరోపించారు. మండలంలోని యల్లాయపాళెంలో ప్రజా చైతన్య యాత్రను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. సూపర్ సిక్స్‌ను అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. మండలంలో ఇఫ్కో కిసాన్ సెజ్, మిథానీ పరిశ్రమ తదితరాలను పట్టించుకుంటే ఎంతో మందికి ఉపాధి కల్పించొచ్చన్నారు. నేతలు నరసింహం, దేవానంద్, నరసయ్య, కాంతారావు, నాగమ్మ, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన స్థల ఆక్రమణపై నిరసన

ఇందుకూరుపేట: మండలంలోని కొరుటూరులో శ్మశాన స్థల ఆక్రమణపై స్థానిక గిరిజనులు నిరసనను మంగళవారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ భూమిని 40 ఏళ్లుగా శ్మశానంగా వినియోగిస్తున్నామని చెప్పారు. బినామీ పేర్లతో స్థలాన్ని ఆక్రమించేందుకు చనుమూరు వెంకటేశ్వర్లు యత్నిస్తున్నారని ఆరోపించారు. సర్వే నిమిత్తం మండల సర్వేయర్ రాగా, కొరిన వారెవరూ రాలేదని చెప్పారు. వెంకటేశ్వర్లు మాత్రమే రావడంతో బినామీ విషయం అర్థమవుతోందని తెలిపారు. ఈ విషయమై తమకు న్యాయం చేయాలని కోరారు. మండల సర్వేయర్ హరనాథ్‌ను అడ్డుకున్నారు. దీనిపై తహసీల్దార్‌కు నివేదిస్తానని ఆయన హామీ ఇచ్చారు.

మేమింతే.. మారమంతే..!



ఆటోడ్రైవర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పదుల సంఖ్యలో ప్రయాణికులను ఎక్కించుకొని మితిమీరిన వేగంతో రయ్.. రయ్ అంటూ రహదారులపై దూసుకెళ్తున్నారు. మితిమీరిన వేగం, పరిమితికి మించిన ప్రయాణం ప్రమాదమని తెలిసినా నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తున్నారు. వీటిని నియంత్రించాల్సిన రవాణా, పోలీస్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఏదైనా అనుకోని ఘటన జరగక ముందే వీరు మేల్కోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– నెల్లూరు(క్రైమ్)





విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సస్పెన్షనే



సూచనలు చేస్తున్న సూర్యతేజ

నెల్లూరు(బారకాసు): పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే సస్పెండ్ చేస్తానని కమిషనర్ సూర్యతేజ హెచ్చరించారు. నగరంలోని 51వ డివిజన్లో గల ఏబీఎం కాంపౌండ్, అరవపాళెం, దండువారి వీధి, కపాడిపాళెం, రైల్వేఫీడర్స్ రోడ్డు తదితర ప్రాంతాల్లో మంగళవారం పర్యటించిన ఆయన మాట్లాడారు. బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలేసే వారిని గుర్తించి జరిమానాలను విధిస్తామని చెప్పారు. ఏబీఎం కాంపౌండ్ ప్రాంగణంలో చెత్త వేస్తున్న వారిని గుర్తించి, అపరాధ రుసుము విధించాలని ఆదేశించారు. భూగర్భ డ్రైనేజీ కనెక్షన్లు తీసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. రైల్వేఫీడర్స్ రోడ్డులో కాలువపై అక్రమంగా నిర్మించిన ర్యాంపులతో నీటి పారుదలకు అడ్డంకి ఏర్పడిందని, అవసరమైన చోట వీటిని తొలగించాలని చెప్పారు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఎస్ఈ రామ్మోహన్‌రావు, ఎంహెచ్ఓ చైతన్య, వెటర్నరీ డాక్టర్ మదన్‌మోహన్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ ప్రకాష్, రెవెన్యూ ఆఫీసర్ ఇనాయతుల్లా తదితరులు పాల్గొన్నారు.

బకాయిలను తక్షణమే వసూలు చేయాలి

మొండి బకాయిదారుల నుంచి ఆస్తి పన్నులను వసూలు చేయాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. రెవెన్యూ విభాగం, వార్డు సచివాలయ అడ్మిన్ కార్యదర్శులతో కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పన్ను వసూళ్లలో లక్ష్యాలను ఉన్నతంగా సాధించిన పది మంది అడ్మిన్ కార్యదర్శులకు ప్రోత్సాహకాలను అందజేస్తామని ప్రకటించారు. గతేడాదితో పోలిస్తే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.7.5 కోట్లను అధికంగా వసూలు చేశామని, ఇదే తరహాలో నూరు శాతం సాధించేలా కృషి చేయాలని కోరారు. నక్ష సర్వే ద్వారా గృహాలు, భవనాల కచ్చిత కొలతలు, వివరాలు అందుతాయని తెలిపారు. సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ చెరువులో ఫ్లోటింగ్ సోలార్ ప్యానళ్లను బిగించేలా ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని చెప్పారు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, రెవెన్యూ అధికారి ఇనాయతుల్లా తదితరులు పాల్గొన్నారు.

సోము వీర్రాజుకు సత్కారం



నెల్లూరు రూరల్: బీజేపీ నేత సోము వీర్రాజును ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించడంపై ఆ పార్టీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన్ను పలువురు సత్కరించారు. పార్టీ జిల్లా నేతలు ముక్కు రాధాకృష్ణగౌడ్, కోట వెంకటేశ్వర్లు, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

డీసీఓ కార్యాలయంలో శిక్షణ



నెల్లూరు(వీఆర్సీసెంటర్): వ్యవసాయ, రైతు ఉత్పత్తిదారులు, ఇతర అనుబంధ ఉత్పత్తిదారుల కోసం సహకార సంఘాలు విరివిగా రిజిస్ట్రేషన్లు చేస్తున్నాయని డీసీఓ గుర్రప్ప పేర్కొన్నారు. విడవలూరు మండల వ్యవసాయ, అనుబంధ ఉత్పత్తిదారుల మహిళా పరస్పర సహాయక సంఘ సభ్యులకు నగరంలోని డీసీఓ కార్యాలయంలో శిక్షణను మంగళవారం నిర్వహించారు. అనంతరం సంఘ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ తదితరాలను అందజేశారు. డీసీఓ కార్యాలయ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఉమాపతి, సీనియర్ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్యాంపస్ డ్రైవ్



నెల్లూరు (టౌన్): నగరంలోని జెనెక్స్ విజన్ కళాశాల క్యాంపస్‌లో పూల్ క్యాంపస్ డ్రైవ్‌ను మంగళవారం నిర్వహించారు. బెంగళూరుకు చెందిన ఏఐ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన డిజిటల్ చాట్ అసోసియేట్ కోసం వివిధ కళాశాలల నుంచి 150 మందికిపైగా విద్యార్థులు హాజరయ్యారు. రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూల అనంతరం 30 మందిని ఎంపిక చేశారు. వీరిని కళాశాల చైర్మన్ వెంగళరెడ్డి, డైరెక్టర్ కొండలరావు అభినందించారు. ప్రిన్సిపల్స్ తేజ, అనిల్‌కుమార్, ప్లేస్‌మెంట్ అధికారి చరణ్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి



పరిశీలిస్తున్న అధికారులు

నెల్లూరు సిటీ: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రూరల్ మండల హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వేణుగోపాల్ పేర్కొన్నారు. కలివెలపాళెంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయాధికారులతో కలిసి మంగళవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. ధాన్యం తేమ శాతం ఎక్కువగా ఉన్నా, పుట్టికి 8.5 కిలోల చొప్పున తీసుకొని కొనుగోలు చేయనున్నామని వివరించారు. ధాన్యాన్ని సరఫరా చేసిన రైతుల ఖాతాల్లో 48 గంటల్లో నగదు జమవుతుందని వివరించారు. దళారులను నమ్మి మోసపోవద్దని కోరారు.

కాకాణిని కలిసిన పర్వతరెడ్డి

నెల్లూరు(బారకాసు): మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని డైకస్‌రోడ్డులోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్సీ, పార్టీ నెల్లూరు సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం కలిశారు. పలు అంశాలపై వీరు చర్చించారు.

సీహెచ్ఓలుగా ఇద్దరికి ఉద్యోగోన్నతి

నెల్లూరు(అర్బన్): జిల్లా పరిధిలోని వైద్యశాఖలో పనిచేస్తున్న ఎంపీహెచ్ఓలకు ఉద్యోగోన్నతులను కల్పించేందుకు గానూ కౌన్సెలింగ్‌ను అమరావతిలో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ హెల్త్ డాక్టర్ పద్మావతి నిర్వహించారు. మర్రిపాడు, చాకిచర్ల పీహెచ్‌సీల్లో ఎంపీహెచ్‌లుగా పనిచేస్తున్న కొండారెడ్డి, ప్రసాద్‌రావుకు సీహెచ్ఓలుగా ఉద్యోగోన్నతి కల్పించి దగదర్తి, ప్రకాశం జిల్లాకు బదిలీ చేశామని డీఎంహెచ్ఓ సుజాత తెలిపారు.

నూరు శాతం ఫలితాలే లక్ష్యం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికబద్ధంగా కృషి చేస్తున్నామని సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ శోభారాణి పేర్కొన్నారు. దర్గామిట్టలోని సోషల్ వెల్ఫేర్ కార్యాలయంలో విలేకరులతో మంగళవారం ఆమె మాట్లాడారు. జిల్లాలోని 23 హాస్టళ్లలో ట్యూటర్లను ఏర్పాటు చేశామని, జూమ్ మీటింగ్‌ను రోజూ నిర్వహించి విద్యార్థుల చదువు తీరును పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. పీఎం అనుసుచిత్ జాతి అభ్యుదయ యోజన కింద జిల్లాలోని కందుకూరు, మనుబోలు బాలికల హాస్టళ్లు ఎంపికయ్యాయన్నారు. వీటి ద్వారా ఒక్కో హాస్టల్‌కు రూ.3.3 కోట్లు మంజూరయ్యాయని, ఈ మొత్తంతో ఆధునికీకరించి, విద్యార్థులకు మౌలిక వసతులను కల్పించనున్నామని వెల్లడించారు.

ధూమపానంతో పెను ప్రమాదం

నెల్లూరు(అర్బన్): ధూమపానం కాళ్లకు శాపంగా మారే ప్రమాదం ఉందని వాస్కులర్ అండ్ ఎండో వాస్క్యులర్ సర్జన్ సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. నో స్మోకింగ్ డేను పురస్కరించుకొని పొగతోటలోని నెల్లూరు వాస్కులర్ సెంటర్‌లో ఆయన మంగళవారం మాట్లాడారు. ధూమపానంతో గుండె, మెదడు రక్తనాళాలు మూసుకుపోయే ప్రమాదం ఉందని చెప్పారు. దీంతో కాళ్లకు రక్తప్రసరణ తగ్గి నొప్పులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. చివరికి కాళ్లను తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడే అవకాశం ఉందన్నారు. కాళ్లు, చేతులకు మంటలొచ్చినప్పుడు మొదటి దశలోనే డాక్టర్ వద్దకెళ్లి పరీక్షలు చేయించుకుంటే మందులతో ఆరోగ్యాన్ని బాగు చేయొచ్చని చెప్పారు.

వేధింపులపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): వివాహితను వేధింపులకు గురిచేసిన భర్త, అత్తింటి వారిపై కేసును చిన్నబజార్ పోలీసులు మంగళవారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. గాంధీనగర్‌కు చెందిన సుమయకు ఖుద్దూస్‌నగర్‌కు చెందిన రసూల్‌తో రెండున్నరేళ్ల క్రితం వివాహమైంది. వీరికి 14 నెలల కుమారుడున్నారు. కొద్ది రోజులు వీరి కాపురం సజావుగా సాగింది. అనంతరం పనికెళ్లడాన్ని ఆయన మానేశారు. తల్లిదండ్రుల వద్దకెళ్లి డబ్బులు తీసుకురావాలని భార్యను వేధించడంతో పాటు పలుమార్లు చేయిచేసుకున్నారు. వేధింపులు తాళలేక ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. దిశ పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు కౌన్సెలింగ్ చేసినా ప్రవర్తనలో ఎలాంటి మార్పురాలేదు. పుట్టింటికి ఈ నెల ఆరున వెళ్లిన ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రెవెన్యూ లోటును పూర్తి చేయాలి



మాట్లాడుతున్న విజయన్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ సంస్థకు సంబంధించిన రెవెన్యూ లోటును పూర్తి చేయాలని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ ఆదేశించారు. విద్యుత్ భవన్‌లోని తన చాంబర్ నుంచి జిల్లా విద్యుత్ అధికారులు, అకౌంట్స్ ఆఫీసర్లతో మంగళవారం నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. రెవెన్యూ వసూళ్లపై దృష్టి సారించాలని సూచించారు. అదనపు లోడ్ క్రమబద్ధీకరణకు గడువు జూన్ 30 వరకు ఉందని, సంస్థ ఇస్తున్న 50 శాతం రాయితీపై వినియోగదారులకు అవగాహన కల్పించాలని కోరారు. ఆక్వా రైతులకు సబ్సిడీపై విద్యుత్‌ను అందిస్తున్నా బకాయిలున్నాయని, వీటిని వసూలు చేయాలని సూచించారు. ఈఈ శేషాద్రిబాలచంద్ర, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ ఉత్పత్తులు విక్రయిస్తే చర్యలు



తనిఖీ చేస్తున్న చైతన్య

నెల్లూరు(బారకాసు): నగరంలో 120 మైక్రాన్ల కన్నా తక్కువ స్థాయి ప్లాస్టిక్ ఉత్పత్తులను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎంహెచ్ఓ చైతన్య పేర్కొన్నారు. స్టోన్‌హౌస్‌పేటలోని తొమ్మిది ప్లాస్టిక్ ఉత్పత్తుల హోల్‌సేల్ దుకాణాలపై ఆకస్మిక దాడులను మంగళవారం నిర్వహించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ 80 కిలోలను గుర్తించి సీజ్ చేసి, రూ.60 వేల జరిమానాను విధించారు. మరోసారి ఇలా వ్యవహరిస్తే దుకాణాలను సీజ్ చేస్తామని స్పష్టం చేశారు.

దేశంలో పెరిగిపోతున్న నిరుద్యోగం



మాట్లాడుతున్న చింతా మోహన్

నెల్లూరు రూరల్: దేశంలో నిరుద్యోగం పెరిగిపోతోందని, వారానికోసారి విదేశాలకు వెళ్లడం మినహా ప్రధాని నరేంద్రమోదీ ఏమీ చేయడం లేదని మాజీ మంత్రి చింతా మోహన్ విమర్శించారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ సక్రమంగా అమలు కావడం లేదని ఆరోపించారు.

బాక్స్‌టైప్ బ్రిడ్జిని నిర్మించాలి



ప్రజా చైతన్య యాత్రలో సీపీఎం నేతలు




కరపత్రాలను పంపిణీ చేస్తున్న నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కొండాయపాళెం గేట్ వద్ద ట్రాఫిక్ సమస్యతో ప్రయాణికులు, వాహనదారులు నిరంతరం ఇబ్బందులు పడుతున్నారని, అక్కడ బాక్స్‌టైప్ బ్రిడ్జిని వెంటనే నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మాదాల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. నగరంలోని 20, 21వ డివిజన్లలో ప్రజా చైతన్య యాత్రను మంగళవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలను ఆరాతీసిన అనంతరం ఆయన మాట్లాడారు. డ్రైనేజీ సమస్య, దోమల బెడదతో ప్రజలు అల్లాడుతున్నారని చెప్పారు. నేతలు రమణయ్య, రత్నం, శ్రీనివాసులు, రఘురామయ్య, మోహన్, రమణయ్య, గురవయ్య, దేవా తదితరులు పాల్గొన్నారు.

పన్నులు పెంచడం చట్టవిరుద్ధం

నెల్లూరు(అర్బన్): నగరపాలక సంస్థ కౌన్సిల్ ఆమోదం లేకుండా గృహ, కుళాయి పన్నులను భారీగా పెంచడం చట్టవిరుద్ధమని సీపీఎం రూరల్ నియోజకవర్గ కార్యదర్శివర్గ సభ్యుడు కొండా ప్రసాద్ పేర్కొన్నారు. బుజబుజనెల్లూరులోని భగత్ సింగ్ కాలనీ, రామ్‌నగర్, కళాకారుల కాలనీ తదితర ప్రాంతాల్లో ప్రజా చైతన్య యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ పార్టీ నేతలు వెళ్లి సమస్యలపై కరపత్రాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. క్రమబద్ధీకరణ పేరిట పన్నులను భారీగా పెంచుతున్నారని ఆరోపించారు. బకాయిలను ఒకేసారి చెల్లించాలంటూ ప్రజలపై కార్పొరేషన్ అధికారుల వేధింపులను తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. అధికారులు ఇదే తరహాలో వ్యవహరిస్తే కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని స్పష్టం చేశారు. 25వ డివిజన్ శాఖ కార్యదర్శి కృష్ణమూర్తి, నేతలు సోమవరపు వెంకయ్య, శ్రీనివాసులు, రవి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలతో కళాకృతుల నిర్మాణం అభినందనీయం



నెల్లూరు(బారకాసు): వేస్ట్ టు ఆర్ట్ ఆలోచనల్లో భాగంగా నగరపాలక సంస్థ కార్యాలయంలోని లాన్‌లో నూతనంగా తీర్చిదిద్దిన సింహం ఆకృతిని కమిషనర్ సూర్యతేజ మంగళవారం ఆవిష్కరించారు. వాడి పడేసిన రబ్బర్ ముక్కలతో సింహం ఆకృతిని సృజనాత్మకంగా రూపొందించారని ప్రశంసించారు.

సూర్యప్రభపై రంగడి విహారం



సూర్యప్రభ వాహనంపై రంగనాథుడు



హంసవాహనంపై ఆశీనులై..

నెల్లూరు(బృందావనం): బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని నగరంలోని శ్రీదేవీ, భూదేవీ సమేత తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో విశేష పూజలను మంగళవారం నిర్వహించారు. సూర్యప్రభ వాహనంపై ఉదయం.. హంసవాహనంపై రాత్రి విహరించారు. భక్తులు విశేషంగా హాజరై రంగడ్ని దర్శించుకున్నారు. ఉభయకర్తలుగా రంగాచారి వెంకటేష్, హేమ, కంచర్ల సతీష్‌చంద్ర గుప్తా, మాలిని దంపతులు వ్యవహరించారు. చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

- బ్రహ్మోత్సవాల్లో స్వామివారికి సింహవాహన సేవ, చంద్రప్రభ ఉత్సవాన్ని బుధవారం నిర్వహించనున్నామని ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి తెలిపారు.